క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణ పట్టదా?

పరిగి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఏఐటీయూసీ నాయకుడు లింగారెడ్డి మండిపడ్డారు. మంగళవారం స్థానిక పారిశుధ్య కార్మికుల, గ్రీన్ అంబాసిడార్లతో కలిసి ఎంపీడీఓ రెడ్డెప్పను కలిసి సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేశారు. గత 7 నెలలుగా కార్మికులకు జీతభత్యాలు ఇవ్వకపోగా వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్నారు. మండలంలో డ్రైనేజీల్లో చెత్తాచెదారంతో పాటు మురుగు పేరుకుపోయిందన్నారు. వెంటనే పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఐకాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించిన పోటీల్లో కళాశాల తరఫున అండర్ 19 విభాగంలో పాల్గొన్నారు. ఇందులో బాలికల విభాగంలో యశ్వశ్రీ, పల్లవి, పావని, శ్రీలత, బాలుర విభాగంలో హేమంత్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాలలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రతినిధులు సురేష్‌కుమార్, బాబాఖాన్, బైరిశెట్టి, వెంకట్ నందర్, అశ్విని, శంకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలపై నేడు సమావేశం

లేపాక్షి: ప్రముఖ దుర్గాదేవి దేవాలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకూ జరగనున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు వీరభద్రస్వామి ఆలయ ఆవరణంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ హాజరవుతారన్నారు. సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు, భక్తాదులు, దాతలు హాజరు కావాలని కోరారు.

మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌కు సన్మానం



ఉషశ్రీచరణ్‌ను సన్మానిస్తున్న నాయకులు

గోరంట్ల: మండల పరిధిలోని పులేరు పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పెనుకొండకు వెళ్లి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను ఘనంగా సత్కరించారు. బోయ శ్రీనివాసులు, సురేష్‌రెడ్డిలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల్లో స్థానం కల్పించడంతో వారు కృతజ్ఞతలు తెలియజేశారు. గోరంట్ల పట్టణ కన్వీనర్ మేదర శంకర, బూదిలి సర్పంచ్ రామాంజినేయులు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు

లేపాక్షి: రాష్ట్ర ఐక్య కార్యాచరణ సమితి కార్యవర్గం ఆదేశాల మేరకు భోజన విరామ సమయంలో లేపాక్షి విద్యుత్ సబ్‌స్టేషన్ ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విద్యుత్‌శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకూ దశల వారీగా నిరసన తెలియజేస్తామన్నారు.

పేద విద్యార్థులకు వైద్య విద్య కలే



మెడికల్ కళాశాల నిర్మాణాలను పరిశీలిస్తున్న నాయకులు

పెనుకొండ: పీపీపీ విధానం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య కలగా మారుతోందని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని మెడికల్ కళాశాల పనులను మంగళవారం సీపీఎం ప్రజా సంఘాల నాయకులు పరిశీలించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు హరి, ప్రవీణ్, జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న ఉన్న వైద్య కళాశాలలను ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలన్నారు. వైద్య విద్య ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామన్నారు.

విరిగిపడుతున్న కొండ చరియలు

- బెంబేలెత్తిపోతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



పులేకమ్మ గుడి సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న కొండ



హైవే పక్కనే జారి పడుతున్న బండరాళ్లు

పెనుకొండ: కూలుతున్న కొండ చరియలతో వాహన చోదకులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. ఒక రోజు, రెండు రోజులు కాదు వర్షాకాలం వస్తే ప్రతి రోజూ నరకమే. పెనుకొండ పట్టణ సమీపంలోని పులేకమ్మ ఆలయం సమీపంలో కొండ ప్రాంతం వద్ద ఈ దుస్థితి నెలకొంది. 14 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేరని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని...

దాదాపుగా పదిహేనేళ్ల క్రితం హైవే విస్తరణ పనుల్లో భాగంగా ఎన్‌హెచ్ 7గా ఉన్న పెనుకొండ జాతీయ రహదారిని హైవే 44గా మార్చారు. రోడ్డు మొత్తం వెడల్పు చేశారేగాని పులేకమ్మ ఆలయం సమీపంలో ఉన్న కొండ ప్రాంతాన్ని తగ్గించడంలో నిర్లక్ష్యం వహించారు. దీనికి తోడు ఎక్కడ పడితే అక్కడ బ్లాస్టింగ్ చేసి వదిలేశారు. దీంతో వర్షాకాలం వస్తే చాలు కొండ పైభాగం నుంచి పెద్ద పెద్ద బండరాళ్లు కింద పడుతున్నాయి. ఈ నేపథ్యంలో అటుగా వెళ్లే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పెద్ద బండరాళ్లు రోడ్డు పక్కన పడుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

ఏళ్ల తరబడి ఈ సమస్య నెలకొన్నా హైవే అథారిటీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం ఎవరూ ఈ సమస్య గురించి ఇప్పటి వరకూ చర్చించిన పాపానపోలేదు. నిత్యం ఈ దారిలో వెళ్లే హైవే పెట్రోలింగ్ సిబ్బంది కూడా చోద్యం చూస్తున్నారే తప్ప ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లకపోవడం బాధాకరమని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కొండపై భాగంలో రాతి శకలాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

> **వెంటనే చర్యలు చేపట్టాలి**
>
> 44వ జాతీయ రహదారిలో పులేకమ్మ ఆలయం సమీపంలో కొండ వద్ద ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో బండరాళ్లు రోడ్డు పక్కన పడుతున్నాయి. దీని వల్ల అటుగా వెళ్లే వారి ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి. ప్రాణాలు పోకముందే దీనిపై దృష్టి సారించాలి.
>
> – సోమశేఖరరెడ్డి, గోనిపేట, పెనుకొండ మండలం

దళితుల భూములను కాపాడండి



దళితుల భూములను పరిశీలిస్తున్న రైతు సంఘం నేత కాటమయ్య

గుడిబండ: మండల పరిధిలోని ఎస్ రాయాపురంలో కబ్జాకు గురైన దళితుల భూమిని రైతు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య మంగళవారం పరిశీలించారు. కాటమయ్య మాట్లాడుతూ కొంకల్లు పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 180లో 34 ఎకరాల భూమిని దశాబ్దాలుగా దళితులు సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే పలువురు బడా నాయకుల అండదండలతో 12 ఎకరాల భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌లో మార్చుకొని ఏకంగా బ్యాంకుల్లో రుణాలు పొందారన్నారు. రెవెన్యూ అధికారులు కూడా ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. దళితుల భూములు ఆక్రమించుకున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్తాక్ అహమద్, దళిత రైతులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు దారేదీ?



ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా నిలపడంతో అంబులెన్స్ వచ్చేందుకు ఇబ్బందిగా మారిన దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ఆర్‌పీజీటీ రోడ్డు పార్కింగ్ అస్తవ్యస్తంగా మారింది. ఈ దారిలో సుమారు 10 వరకూ ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. అయితే ఎక్కడ పడితే అక్కడ ద్విచక్ర వాహనాలు రోడ్డుపైనే నిలిపేస్తుండటంతో అత్యవసరంగా వచ్చే అంబులెన్స్ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. సమీపంలో సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు ఉండటంతో వాహనాల పార్కింగ్, జనంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడుతుండటంతో సమస్య వస్తోంది. ఇప్పటికైనా సక్రమంగా వాహనాల పార్కింగ్ జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన దృశ్యం

గోరంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలం సర్వేనంబర్ 271లో అక్రమంగా కట్టిన నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. జేసీబీతో పోలీసుల సహాయంతో ఇంటి నిర్మాణాలను కూల్చివేశారు.

రికార్డుల పరిశీలన

రొద్దం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. మండలంలోని సానిపల్లిలో చేపట్టే భూసర్వేకు సంబంధించిన పలు రికార్డులు తనిఖీ చేశారు. ఆర్ లోచెర్ల గ్రామంలో ఓ భూ సమస్యపై తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌తో ఆరాతీశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. కియా ఎస్ఐ రాజేష్ వివరాలమేరకు.. బెంగళూరుకు చెందిన మంజునాథ్ తన కుటుంబ సభ్యులు హేమలత, అభిషేక్, నితీష్‌తో కలసి కారులో మంత్రాలయం బయలుదేరారు. మార్గమధ్యలో గుట్టూరు వై జంక్షన్ సమీపంలోకి రాగానే ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన మంజునాథ్, హేమలతలను ఆస్పత్రికి తరలించారు.

హెల్త్ సెంటర్‌ను మార్చొద్దు



హిందూపురం ప్రభుత్వాస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

హిందూపురం: పట్టణంలోని రహమత్‌పురంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇందిరానగర్‌కు మార్పు చేయొద్దని సీపీఐ , ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఆధ్వర్యంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రి వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఉన్నఫళంగా రహమత్‌పురంలోని హెల్త్‌సెంటర్‌ను ఇందిరానగర్‌కు మార్పుచేయడంతో రహమత్‌పురంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అలాగే ఆస్పత్రికి వివిధ అనారోగ్య సమస్యలపై వస్తున్న వారిని రెఫర్ చేయకుండా ఆస్పత్రిలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి మారుతీరెడ్డి, మహిళా సమైక్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సబీర, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కమల్‌బాషా, మహిళా సమైక్య జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

సోమందేపల్లి: మండల పరిధిలోని కొల్లకుంట గ్రామంలో రైతు భాస్కర్‌కు చెందిన కేబుల్‌ను దొంగలు సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారు. దాని విలువ రూ.35 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. అప్పుచేసి మోటారు బిగించుకొని వ్యవసాయం చేస్తున్నానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని రాంపురం పంచాయతీ హనుమప్పపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ నరసింహులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పరామర్శించి రూ.11 వేలు ఆర్థికసాయం చేశారు. నాయకులు నారాయణ, గోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, చిన్నఅంజి, వెంకటేష్, ఓబులేసు, రెడ్డప్ప, రామాంజినేయులు, తులసీ ప్రసాద్, పాల్గొన్నారు.

వాహన మిత్రకు దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: మండలంలోని అర్హత ఉన్నవారు వాహన మిత్ర పథకానికి దరఖాస్తులను ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ నెల 17 నుంచి 19వ తేదీలోపు అందజేయాలని ఎంపీడీఓ రామరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ కలిగిన ఉండి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిధులు మళ్లిస్తే న్యాయ పోరాటం

లేపాక్షి: లేపాక్షి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన సాధారణ నిధులు రూ. 92 లక్షలను మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి వెచ్చించాలి. నిధులు దారి మళ్లిస్తే న్యాయ పోరాటం చేస్తామని వైస్ ఎంపీపీ అంజినరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఉదయం లేపాక్షి మండల పరిషత్ కార్యాలయం వద్దకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకొని నిరసన తెలిపారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీడీఓ.. ఎంపీటీసీలతో చర్చించకుండా కూటమి నాయకులతో కుమ్మక్కై నిధులపై నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. దీనికి ఎంపీడీఓ నరసింహమూర్తి స్పందించి ఎంపీపీతో పాటు ఎంపీటీసీలతో సమావేశం ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తామని తెలియజేయడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నిస్సార్, ఎంపీటీసీ సభ్యులు జైకిసాన్, కోఆప్షన్ సభ్యులు బషీర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మల్లన్న, చలపతి, నాయకులు ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, తిప్పన్న, బోర్ల అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం



గుండుమల పాఠశాలలో ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరిస్తున్న ఉపాధ్యాయులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం సుకన్య ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులకు ఓజోన్ పొర ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎన్‌జీసీ కోఆర్డినేటర్ చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని బసవనపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

హిందూపురం: మండల పరిధిలోని పూలకుంట ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కేశవమూర్తి అధ్యక్షతన మంగళవారం ఓజోన్ పొరపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ఓజోన్ పొర అడ్డుగా ఉండటంతోనే తీవ్రమైన సూర్య కిరణాలు భూమికి నేరుగా ప్రసరించకుండా కాపాడుతోందన్నారు. అయితే విచ్చలవిడిగా హానికారమైన ఉద్గారాల వినియోగంతో రాబోవుతరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓజోన్ పొరను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పోషణ మాసోత్సవాలు'

రొళ్ల: మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మడకశిర, రొళ్ల, అగళి మండలాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో బుధవారం నుంచి అక్టోబర్ 16 వరకూ 'పోషణ మాసోత్సవ' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

అందుబాటులో ఉండి సేవలందించండి

పెనుకొండ: పాడి రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ గిరిజ పేర్కొన్నారు. పట్టణంలోని డీడీ కార్యాలయంలో మంగళవారం పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లోని సిబ్బందితో సమావేశమయ్యారు. డీడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కార్యాలయాలకు వచ్చే రైతులకు అందుబాటులో ఉండి వారి సూచనలను పరిగణలోకి తీసుకుని పశువులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. దాణా కోసం డీడీ కట్టిన ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. సమావేశంలో ఏడీ శ్రీరాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పదాధికారుల నియామకం

పావగడ: తాలూకా కర్ణాటక దళిత సంఘర్ష సమితి (ప్రొ.బి.కృష్ణప్ప) పదాధికారుల ఎంపిక ప్రక్రియ స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవనంలో మంగళవారం జరిగింది. పావగడ పట్టణంతో పాటు నాలుగు హోబళీల విభాగాలకు సంఘటనా సంచాలకులను నియమించారు. కేఆర్ అంజన్ (పావగడ), నరసింహమూర్తి (వెంకటాపురం హోబళి) నాగరాజు (నాగలమడక హోబళి), ఆర్ అంజయ్య (వైఎన్ హొసకోట హోబళి), తూమకుంటె తిప్పేస్వామి (నిడగల్)లను ఎంపిక చేశారు.

రొద్దంలో వరుస దొంగతనాలు



పూజమ్మదేవి ఆలయంలో బీరువా ధ్వంసం చేసిన దృశ్యం



అంజనరెడ్డి ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం

- ఆందోళనలో ప్రజలు

రొద్దం: మండలంలో గత నెల రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండల పరిధిలోని సుబ్బరాయప్పకొట్టాల గ్రామ సమీపంలో వెలసిన పూజమ్మ దేవాలయంలో సోమవారం రాత్రి ఆలయ తలుపులు పగలకొట్టి అందులోని వెండి ఆభరణాలు, కొంత నగదు ఎత్తుకెళ్లారు. మూడు కేజీల వెండి ఆభరణాలు, ఆరు గ్రాముల బంగారు తాళి బొట్టు, ఐదు పట్టు చీరలు, రూ. 30 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అలాగే అదేరోజు రాత్రి రొద్దం గ్రామ సమీపంలోని పెన్నానది ఒడ్డున ఉన్న ఓ లేఅవుట్‌లో నివాసం ఉంటున్న ఆర్ కుర్లపల్లికి చెందిన అంజనరెడ్డి ఇంట్లో చోరీకి యత్నించినా దొంగలకు ఏమీ దొరకలేదు. అనంతరం పక్కనే ఉన్న శ్రీసత్యసాయి భజన మందిరంలో బీరువాలు పగలకొట్టి దొంగతనానికి ప్రయత్నించారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, తలుపులు పగలకొట్టి చోరీకి పాల్పడ్డారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

ఇదిలా ఉండగా ఇటీవల అదే లేఅవుట్‌లో ఓ ఇంట్లోలో చోరీ జరిగింది. గత రెండు నెలల క్రితం రొద్దకాంబదేవి ఆలయం ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో కూడా దొంగతనం జరిగింది. వారం రోజుల క్రితం రొద్దం గ్రామ సమీపంలోని వ్యవసాయ మోటర్ల వద్ద మోటర్లకు సంబంధించిన వైర్లు, స్టార్టర్లు చోరీకి గురైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మండలంలోని తురకలాపట్నం గ్రామ సమీపంలోని పంచముఖ ఆంజనేయస్వామి గుడిలో చోరీ జరిగింది. నగదు ఉన్న హుండీ ఎత్తుకెళ్లారు. రాత్రి వేళల్లో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు చేస్తుండటంతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆలయ పూజారి, ఇంటి యజమాని అంజినరెడ్డి ఫిర్యాదు మేరకు మంగళవారం ఎస్ఐ నారేంద్ర ఆధ్వర్యంలో క్లూస్ టీం చోరీ జరిగిన ఇళ్లు, ఆలయాన్ని పరిశీలించారు.

క్రికెట్ టోర్నీ ఫైనల్స్‌కు 'లక్ష్మీ విద్యానికేతన్'

రొళ్ల: స్వాతంత్ర్య సమరయోధుడు మాజీ ఎంపీ, దివంగత శ్రీరామిరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌కు రొళ్ల లక్ష్మీవిద్యానికేతన్ స్కూల్ జట్టు చేరింది. మంగళవారం రత్నగిరి జెడ్పీహెచ్ఎస్ జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరినట్లు కరస్పాండెంట్ శ్రీధర్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

అగళి: 'త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం' అని ఎమ్మార్పీఎస్ స్టేట్ ప్రచార కార్యదర్శి అలుపనపల్లి శ్రీనావాసులు హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్బారావుకు దండోరా నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని రాంపురంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.30 వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది మంగళవారం గాలికుంట వ్యాధికి వాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులు, గేదెలు ఉన్న ప్రతి ఇంటికెళ్లి గాలికుంటు వ్యాధికి టీకాలు వేయించుకోవాలని దానివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పశువైద్య సిబ్బంది మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మా పొలాన్ని కాపాడండయ్యా..



మంజునాథ్ పై 1బీ ఉన్న దృశ్యం

అగళి: మండల పరిధిలోని నరసబుంది గ్రామంలోని తన పొలాన్ని ఆక్రమించుకునేందుకు గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి ప్రయత్నిస్తున్నాడని రైతు మంజునాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 8-6లో విస్తీర్ణం 0.31 సెంట్ల భూమిని తమ తాతల కాలం నుంచి సాగు చేస్తున్నామన్నారు. భూమికి సంబంధించిన అన్ని రికార్డు ఉన్నాయన్నారు. అయితే నాగరాజు రికార్డులన్నీ మార్చేసి తమ పొలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. సర్వేయర్ వచ్చి భూమి మీదే అని తేల్చినా నాగరాజు మాత్రం దౌర్జన్యం చేస్తున్నాడన్నారు. పోలీసులు, అధికారులు తనకు న్యాయం చేయాలని మంజునాథ్ వేడుకుంటున్నారు.